సాక్షి చిత్తూరు

బుధవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2025



వారి జీతాలు పెంచడం లేదా?
ఎమ్మెల్యేల జీతాలు పెంచి మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచకపోవడం దారుణమని ఏఐటీయూసీ ఆక్షేపించింది. - IIలో



కోర్టు తీర్పు కూటమికి చెంప పెట్టు
మద్యం కుంభకోణం అంటూ కక్షసాధింపులకు పాల్పడిన కూటమికి కోర్టు తీర్పు చెంప పెట్టని మాజీ డెప్యూటీ సీఎం పేర్కొన్నారు. - IIలో



మసీదు భూముల ఆక్రమణ
పుంగనూరు పట్టణంలోని రాతిమసీదుకు చెందిన భూములను కొందరు ఆక్రమించారని మసీదు కమిటీ ఆరోపించింది. - IIలో

న్యూస్‌రీల్

కిట్ల వివరాలను సేకరించి పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసి మిగిలిన ఎస్‌ఆర్‌వీకేఎం (సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర) కిట్ల వివరాలను సేకరించి నివేదికలు పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీచేసిన ఉత్తర్వులు డీఈఓ కార్యాలయానికి మంగళవారం పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి గాను పంపిణీ చేసి మిగిలిన ఎస్‌ఆర్‌వీకేఎం కిట్ల వివరాలను సేకరించాలన్నారు. నిర్దేశించిన ప్రొఫార్మాలో నిర్దేశించిన తేదీలోపు పంపాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

అవార్డుల ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్ : భారతదేశ తొలి విద్యాశాఖా మంత్రి జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని త్వరలో ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ, విద్యార్థి అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డులకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారి వివరాలను పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ నెల 10వ తేదీలోపు నిర్దేశించిన ప్రొఫార్మాలో వివరాలను పంపాలన్నారు. జిల్లాలోని ఉర్దూ మీడియంలో 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో టాపర్ విద్యార్థుల వివరాలను స్టూడెంట్ అవార్డులకు పంపాలని పేర్కొన్నారు. అలాగే విధుల పట్ల ఉత్తమ సేవలందిస్తున్న ఉర్దూ టీచర్ల వివరాలను పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

10న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీన సంకటహర గణపతి వ్రతం నిర్వహించనున్నట్టు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 వరకు, రాత్రి 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 నుంచి స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు.

'పేద, మధ్యతరగతి పిల్లలు పెద్దపెద్ద చదువులు చదవాలి. డాక్టర్లు, ఇంజినీర్లుగా రాణించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మించింది. ఇందులో ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు కూడా పూర్తిచేసింది. ఇంతలో ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోంది. వెంటనే ప్రయివేటీకరణ ఆపాలి.. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు తేల్చిచెప్పారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై ఆందోళనలు మిన్నంటించారు.

బాబూ.. ప్రయివేటీకరణ ఆపు!


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వైద్యవిద్య దూరం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు భారీగా నష్టం
- పీ–4 విధానంతో.. రాష్ట్రంలో మళ్లీ బానిసత్వం
- 'బాబు' ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం
- చిత్తూరులో అంబేడ్కర్ విగ్రహానికి విన్నవించిన వైనం

చిత్తూరు అర్బన్: 'పేద, మధ్యతరగతి ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం చాలా దుర్మార్గం. పేద విద్యార్థుల భవిష్యత్తుపై ఇది గొడ్డలిపెట్టు లాంటిది' వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా ఇలాంటి దుశ్చర్య జరగలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం చిత్తూరు నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నగరంలోని దర్గా కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి, వినతి పత్రం అందచేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు పార్టీ సమన్వయకర్త ఎంసీ.విజయానందరెడ్డి, పూతలపట్టు సమన్వయకర్త డా.సునీల్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారితో పాటు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ అర్హతతో ధారాదత్తం చేస్తున్నారు

నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఓ లక్ష్యం ప్రకారమే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి, రూ.కోట్లు దోచుకోవడానికి ప్లాన్ చేసిందన్నారు. దీనిపై కూటమి పార్టీ ఎమ్మెల్యేల నుంచే తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పదుల సంఖ్యలో ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఒక్క మెడికల్ కళాశాల కూడా నిర్మించని చంద్రబాబు నాయుడు, ఏ అర్హతతో కళాశాలలను కోటీశ్వరులకు ధారదత్తం చేస్తున్నారన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షంపై కూటమి ప్రభుత్వం.. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేశారు. మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ సరళామేరి, యాద మరి ఎంపీపీ సురేష్ బాబు, వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, గజేంద్ర, వెంకటరమణ, దొరబాబు, భరత్, ప్రసాద్ పాల్గొన్నారు.

బానిసత్వానికి ప్రాణం పోస్తున్నారు



ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ప్రభుత్వ వైద్య కళాశాలలకు పెద్దపీట వేశారు. ఆయనకు తెలియదా, వీటిని ప్రైవేటీకరణ చేయాలని? పేద ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య సులువు చేయడానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 17 కళాశాలలకు బీజం వేశారు. పలు కళాశాలల్లో అడ్మిషన్లు కూడా అందించారు. మిగిలినవి పలు దశల్లో ఉంటే.. అన్నింటినీ కలిపి ఎలా ప్రైవేటీకరణ చేస్తారు. రాష్ట్రంలో ప్రజల్ని బానిసత్వంగా బతకాలని చెబుతూ, వైద్య కళాశాలలను కోటీశ్వరుల చేతుల్లో పెడుతున్నారు. మీకు ఏ అధికారం ఉంది..? అసలు పీ–4 అంటే ఏంటి.. పేదల్ని దోచి, పెద్దలకు ఇవ్వడమా..?

– నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

ఇది పెత్తందార్ల ప్రభుత్వం



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో వైఎస్.జగన్ పూర్తిగా పేద ప్రజల కోసం ఆలోచన చేసి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారు. కానీ ఇప్పుడున్నది పెత్తందార్ల ప్రభుత్వం. అందుకే ప్రయివేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీలు అప్పగిస్తోంది. 17 కళాశాల్లో 2,500 వరకు మెడికల్ సీట్లు వస్తాయని భావిస్తే.. డాక్టర్ అవుదామనుకున్న పిల్లల భవిష్యత్తును ఈ ప్రభుత్వం దెబ్బ కొట్టింది. రూ.20 లక్షలున్న ఫీజును రూ.57 లక్షలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కడుపుకొట్టి.. ప్రైవేటు వ్యక్తులకు కళాశాలలు అప్పగిస్తున్నారు. దేశంలో దీనికన్నా దుర్మార్గమమైన పని ఇంకోటి ఉండదు. అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ కార్పొరేట్ కొమ్ము కాయడం బాబుకు అలవాటైపోయింది.

– డాక్టర్ సునీల్, సమన్వయకర్త, పూతలపట్టు

బాబూ.. ఒక్క ఇటుకైనా వేశావా?



చంద్రబాబునాయుడు 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెబుతున్నారు. ఇన్నేళ్లలో ఒక్క వైద్య కళాశాలకైనా నువ్వు పునాది వేశావా..? మా నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి సిగ్గుండాలి. ప్రభుత్వ చర్యల వల్ల తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. రూ.4 వేల కోట్లు పెడితే ఇప్పటికే పలు దశల్లో ఉన్న కళాశాలలన్నీ పూర్తవుతాయి. ఆ మాత్రం కూడా పేదల కోసం నిధులు పెట్టకుండా ప్రైవేటీకరణ చేస్తోంది.

– ఎంసీ.విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, చిత్తూరు

హక్కులు లాక్కున్నారు..



అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను చంద్రబాబు నాయుడు లాగేసుకుంటున్నారు. పేదలు వైద్య విద్య చేయకూడదని కుట్రపన్ని.. కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారు. వైఎస్.జగన్ మదిలో వచ్చిన ఆలోచనకు కార్యరూపం ఇచ్చి 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తుంటే.. కూటమి ప్రభుత్వం వాటిని కోటీశ్వరుల చేతుల్లోకి పెట్టేస్తోంది. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

– లలిత కుమారి, మాజీ ఎమ్మెల్యే.

రాజ్యాంగాన్ని అవమానిస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలు, పేదలు లక్ష్యంగా కుట్రలు పన్నుతోంది. రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంకుని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలు తీసుకొస్తే.. చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ చేయడం దారుణం. ఎస్సీ, ఎస్టీలకు విద్య, వైద్యం ప్రాథమిక హక్కుగా కల్పించిన అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అవమానిస్తోంది. పేద విద్యార్థులను వైద్యవిద్యకు దూరం చేస్తోంది.

– పీపీ.గాయత్రీదేవి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి.



సూర్యప్రభ వాహనంపై మలయప్ప

దివ్యరూపం..మహాతేజం

- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ సేవలో శ్రీనివాసుడు
- నేడు రథోత్సవం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన కాంతుల్లో మలయప్ప స్వామి దేదీప్యమానంగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉదయం సూర్య కాంతుల మధ్య స్వర్ణకాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయంలోని రంగ నాయక మండపంలో స్నపన తిరుమంజనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు సేద తీరారు. సాయంత్ర సహస్ర దీపాలంకరణ సేవలో స్వామి ఊయలూగుతూ దర్శనమిచ్చారు. ఆ తర్వాత రాత్రి నిర్వహించిన చంద్రప్రభ వాహన సేవలో దివ్య మంగళ రూపంలో దర్శనమిచ్చారు. పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

నేడు శ్రీవారి రథోత్సవానికి సర్వం సిద్ధం

బుధవారం శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి రథోత్సవం సాగనుంది

చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

గురువారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. వైదికంగా నిర్వహించే ఈ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ అధికారులు పుష్కరిణిలో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.





చంద్రప్రభ వాహనంపై జగద్రక్షకుడు

బాస్కెట్‌బాల్ విజేత చిత్తూరు



విజేతగా నిలి చిత్తూరు జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ విజేతగా చిత్తూరు జిల్లా జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు గుడివాడలో ఏపీ బాస్కెట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 14 పురుషుల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో చిత్తూరు జట్టు, రామచంద్రాపురం (తూర్పు గోదావరి) జట్లు తలబడ్డాయి. తూర్పుగోదావరి జట్టు పై 79–66 పాయింట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయకేతనం ఎగురవేసింది. క్రీడాకారులు, కోచ్, పీడీ జేమ్స్‌ను రాష్ట్ర బాస్కెట్‌బాల్ అధ్యక్షులు చెంగల్రాయనాయుడు, జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు అభినందించారు. ఉత్తమ క్రీడాకారుడిగా ఆదర్శ్‌పాల్, ఉత్తమ షూటర్‌గా ఆకాష్ ప్రత్యేక బహుమతులు పొందారు. ఇద్దరు క్రీడాకారులు చిత్తూరు జట్టు లోని క్రీడాకారులే కావడం గర్వకారణం.

మైనింగ్‌లో మనీ రాజా!

- జిల్లాలో ఆగని దొంగ బిల్లుల దందా
- వసూళ్లలో రాజ్యమేలుతున్న ఓ కూటమి నేత
- దొంగ బిల్లులతో విచ్చలవిడిగా ఖనిజం తరలింపు
- దొంగ బిల్లుల వ్యవహారానికి సంబంధం లేదని చేతులెత్తేసిన అధికారులు
- జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా

సాక్షి, టాస్క్‌ఫోర్స్: జిల్లాలో గ్రానైట్ మాఫియా చెలరేగిపోతోంది. పచ్చ సైన్యం ఖనిజాన్ని దోచేస్తోంది. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతోంది. దొంగబిల్లుల దందాతో రా×రాజుశైను చేస్తోంది. ఓ మంత్రి పేరును తెరపైకి తీసుకొచ్చి దొంగ బిల్లుల దందాకు ఆజ్యం పోస్తోంది. ఈ వ్యవహారంపై ఆ శాఖ అధికారులు తమకు సంబంధం లేదని చేతులెత్తేశారు. దీని కారణంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా పెడుతోంది.

దొంగ బిల్లుల గోల ఏంటి?

చిత్తూరు జిల్లా కేంద్రంలో దొంగ బిల్లుల యవ్వారం గోలగోలగా మారింది. విదేశీ గొప్పలు చెబుతూ కొత్తగా రాజకీయ తీర్థం పుచ్చుకున్న ఓ కూటమి నేత మైనింగ్ మాఫియాతో జతకట్టాడు. చేతికి మట్టి అంటకుండా డబ్బులు సంపాదించే పనికి పదును పెట్టాడు. గ్రానైట్ తవ్వకాలు కొద్ది మేరకు చేసుకుంటూ.. అక్రమ తరలింపుపై కన్నేశాడు. అధికారిక సంస్థను బయపెట్టి.. ఆ బిల్లులకు చెక్ పెట్టే ప్రయత్నం చేశాడు. విదేశీ తెలివితేటలు ఉపయోగించి దొంగ బిల్లుల చలామణికి మార్గం సుగమం చేసుకున్నాడు.

మస్తు మనీ రావు?

దొంగబిల్లుల అమలుకు అన్ని రూట్లను రారాజు తన గుప్పెట్లోకి తెచ్చుకున్నాడు. కొందరు ప్రజాప్రతినిధులు, మంత్రుల పేరు చెబుతూ అడ్డదారుల్లో అడ్డు తొలగించుకున్నాడు. 20 నుంచి 30 మందితో కూడిన గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. వారి ద్వారా రాత్రి పూట కాపు కాచి దొంగ బిల్లులు పంపిణీ చేస్తూ వస్తున్నాడు. ఒక్కో బిల్లుకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. దొంగ బిల్లుల అమలులో ఆఫర్లు కూడా ఇస్తున్నారు. ఒక బిల్లుతో రెండు నుంచి మూడు ట్రిప్పుల వరకు తరలించుకోవచ్చని ఆఫర్లు ప్రకటిస్తున్నారు. అక్రమార్కులు చాలా మంది దొంగ బిల్లుల వైపే మొగ్గు చూపుతున్నారు. కాగా వసూళ్ల మొత్తాన్ని వాటాలు పంచుతూ గ్రానైట్ మాఫియానే మేసేస్తున్నాడని కూటమి నేతలు భగ్గుమంటున్నారు. అలా కొద్ది మేర వాళ్లకు.. వీళ్లకు పంచి.. మిగిలిన ఆదాయంతో విలువైన ఆస్తులు, బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

జిల్లా యంత్రాంగం నిఘా

దొంగ బిల్లుల వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని మైనింగ్ శాఖ చేతులెత్తేసింది. దీంతో జిల్లా యంత్రాంగం ఓ కమిటీని వేసింది. వారు గుట్టు చప్పుడుకాకుండా ఈ దొంగబిల్లుల మాఫియా గుట్టును కదిలించే ప్రయత్నం చేస్తున్నారు. దొంగ బిల్లుల సృష్టికర్త విషయాన్ని ఇప్పటికే అధిష్టానం వరకు తీసుకెళ్లిన ఆ నేతలు జిల్లా యంత్రాంగంతో కూడా చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో యంత్రాగం సైతం గట్టిగా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు కమిటీ మైనింగ్ మాఫియా చెక్ పెట్టే పనిలో పడింది. కాగా దొంగ బిల్లులను టచ్ చేయొద్దని పలు శాఖల అధికారులకు ఆ నేత నుంచి వార్నింగ్ వెళ్లినట్లు చర్చలు జరుగుతున్నాయి.

మనల్ని ఆపేదెవడ్రా?

దొంగ బిల్లుల వ్యవహారం తెరపైకి రావడంతో కూటమిలో కలకలం రేపింది. జిల్లాలోని సీనియర్లంతా ఎవడు రా వీడు?.. అని ఆరా తీసే పనిలో పడ్డారు. దొంగ బిల్లుల వ్యవహారంలో కోట్లకు పడగెత్తుతున్నాడని.. మాఫియాను మట్టు పెట్టేందుకు అధిష్టానానికి కొందరు సీనియర్ నేతలు ఫిర్యాదు చేశారు. అయినా ఈ దొంగ బిల్లుల దందాకు అడ్డు లేకుండా చేస్తూ.. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కాపు కాస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. మంగళవారంతో అధికార బిల్లుకు గడువు ముగియడంతో ...దొంగ బిల్లుల దందాను విస్తృతం చేయాలని చూస్తున్నారు. కొత్త సంస్థకు పగ్గాలు వచ్చేంత వరకు దొంగ బిల్లుల దందాకు జోరుగా రైట్..రైట్ చెప్పాలని ఆర్డర్లు వేశారు. మంగళవారం నుంచి రారాజు ఆర్డర్లు అమలుకు నోచుకోనున్నట్లు కూటమి సీనియర్ నేతలే చెబుతున్నారు. అడ్డొస్తే.. కొంత మంది ప్రజాప్రతినిధులు, మంత్రుల పేర్లు చెప్పాలని గ్యాంగ్‌కు చెప్పారని వారు అంటున్నారు. ఇది ఇలా ఉండగా.. ఈ దొంగ బిల్లుల వ్యవహారాన్ని బయటకు తీసుకొచ్చిన ఆ కూటమి నేత ఎవరు అని మైనింగ్ మనీ రాజా తలలు పట్టుకుంటున్నారని తెలిసింది.



అసోసియేషన్ పేరుతో ఉన్న దొంగబిల్లు

కోర్టు తీర్పు కూటమికి చెంప పెట్టు

శ్రీరంగరాజపురం : మద్యం స్కామ్ విషయంలో కోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు 49 కొత్తపల్లి మిట్ట ప్రధాన కూడలిలో బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనలేక కూటమి ప్రభుత్వం లిక్కర్‌స్కాంలో ఎంపీ మిథున్ రెడ్డిని ఇరికించిందన్నారు. ఎంపీగా మిథున్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ప్రమేయం ఉండదన్నారు. కూటమి ప్రభుత్వం బెయిల్ రాకుండా 72 రోజులు నిర్బంధించిందన్నారు. ఉన్నత న్యాయస్థానాలు కేసు పరిశీలించి బెయిల్ ఇవ్వడం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత జనార్దన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప, నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకరత్న, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, మేధావుల విభాగం కార్యదర్శి రాజన్, నాయకులు శేషాద్రి, గోపి, ఏనయ్య, మార్కొండయ్య, అమాసయ్య, చిన్నబ్బ పాల్గొన్నారు.

బ్యాగ్‌లెస్ డేస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ పాఠశాలల్లో బ్యాగ్‌లెస్ డేస్ అమలు చేయాలంటూ రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం బ్యాగ్‌లెస్ డేస్ అమలు చేయాలన్నారు. బాల్ సంసద్ అమలు, బ్యాగ్‌లెస్ డేస్ (బ్యాగ్ లేని దినోత్సవం) ప్రతి శనివారం నిర్వహించాలన్నారు.

దుర్గమ్మకు క్షీరాభిషేకం

దుర్గాష్టమి పర్వదినం సందర్భంగా వి.కోటలోని దుర్గామాత ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే క్షీర కలశాల శోభాయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. 4,005 మంది మహిళలు క్షీర కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజ్ కుటుంబ సమేతంగా ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహించారు. తొలుత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పట్టు వస్త్రాల సారెకు ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి మహిళలు క్షీర కలశాలతో ఊరేగింపుగా దుర్గామాత ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి నామ స్మరణతో పట్టణం మార్మోగింది. అభిషేకం, పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. - వి.కోట

క్షీర కలశాల ఊరేగింపు



మసీదు భూముల ఆక్రమణ

పుంగనూరు: పట్టణంలోని రాతిమసీదుకు చెందిన భూములు 495 ఎకరాలు ఆక్రమించారని కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం సభ్యులు బాబుల్లి, సర్దార్, యూసఫ్ ఆధ్వర్యంలో సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడేపల్లె మండలం, కాటిపేరి, గురుమర్దనపల్లెలో 495 ఎకరాల భూమి మసీదుకు చెందిందని, దీన్ని వడ్డెరపల్లెకి చెందిన గంగిరెడ్డి, దిగువపల్లెకి చెందిన వెంకటరెడ్డి మరికొందరు ఆక్రమించారని తెలిపారు. సదరు భూములు మసీదుకు చెందినవని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారిస్తామని తెలిపారు.

చిత్తూరులో టీడీపీ నేతల బాహాబాహీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని హై రోడ్డులో టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు రోడ్డుపై తన్నులాడుకున్నారు. ఓ పెట్రోలు బంకు నిర్వాహకులకు కొందరు రూ.లక్షల్లో అప్పులిచ్చి, వాటాలు రాసుకున్నారు. అయితే నిర్వాహకులు పలువురిని మోసం చేసినట్లు, రూ.కోట్లలో వసూలు చేసినట్లు తెలుసుకున్న రెండు వర్గాలు మంగళవారం సాయంత్రం పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నాయి. ఇక్కడ పుంగనూరుకు చెందిన టీడీపీ నేత.. బంకు నిర్వహణ ప్రస్తుతం తనపైనే ఉందని, గతంలో ఉన్నవాళ్లకు సంబంధంలేదని చెబుతుండగా.. మరో వర్గం వచ్చి వాదనకు దిగింది. స్థానిక ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు వాగ్వాదానికి దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య బాహాబాహీ జరిగింది. అనంతరం పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు.

తల్లిదండ్రులు మందలించారని..



మృతిచెందిన శోభ

వి.కోట: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఉరి వేసుకుని ఓ యువతి తనువు చాలించిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని పత్రపల్లి గ్రామానికి చెందిన మురుగేష్, శ్యామల దంపతులు పట్టణంలోని ఆంధ్రబ్యాంకుకు ఎదురుగా అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఆ దంపతుల కుమార్తె శోభ(19) ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఓ వ్యక్తిని ప్రేమించి ఆ వ్యక్తినే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులతో తరచూ గోడవపడేది. ఈ నేపథ్యంలో మంగళవారం తల్లిదండ్రులతో మరోసారి గోడవపడింది. వారు మందలించడంతో మనస్తాపంతో శోభ ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.తల్లిదండ్రులు తలుపులు బద్దలు కొట్టి స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యులు శోభ అప్పటికే మృతి చెందిన్నట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించిన్నట్లు సీఐ సోంశేఖర్‌రెడ్డి తెలిపారు.

వారి జీతాలు పెంచడం లేదా?

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జీతాలు, మాజీ ప్రజాప్రతినిధులకు పెన్షన్లు పెంచుతున్న కూటమి ప్రభుత్వం, మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు ఎందుకు పెంచడం లేదని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 11, 12 తేదీల్లో జరిగే మూడో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ య్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా నాయకులు రమాదేవి, గోవిందస్వామి, రఘుమోహన్, ఆయమ్మల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయకుమారి పాల్గొన్నారు.

ప్రశ్నించడంతోనే గ్యాంగ్‌రేప్ విషయం వెలుగులోకి!

- నిందితులందరూ టీడీపీ కార్యకర్తలే
- గతంలోనే వారు టీడీపీలోకి వెళ్లారు
- అభివృద్ధిని స్వాగతిస్తాం.. దుర్మార్గాలను ఎండగట్టి తీరుతాం
- చిత్తూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి



మాట్లాడుతున్న విజయానందరెడ్డి, గాయత్రీదేవి

చిత్తూరు అర్బన్: 'చిత్తూరులో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డ నిందితులు ముమ్మాటికీ టీడీపీ కార్యకర్తలే. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌నాయుడు స్వయానా వీళ్లకు పచ్చ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పుడు గ్యాంగ్‌రేప్ విషయం బయటపడంతో నిందితులకు వైఎస్సార్‌సీపీ రంగు పూయాలనుకోవడం టీడీపీ నేతల అవివేకానికి నిదర్శం' అంటూ చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసి.విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్యాంగ్‌రేప్ జరిగిన విషయం, బాధితులకు న్యాయం చేయాలని ప్రతిపక్షం ప్రశ్నించడంతోనే పోలీసు శాఖలో చలనం వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ దీనిపై ప్రశ్నించకుంటే విషయం వెలుగులోకి వచ్చేదికాదని, బాధితలకు అన్యాయం జరిగేదనని స్పష్టం చేశారు. ఎస్పీ కల్పించుకోవడంతోనే పోలీసు అధికారులు కేసు నమోదు చేశారని, లేని పక్షంలో ఘటన మరుగున పడిపోయేదన్నారు. ఆగస్టు 27న నిందితులు కిషోర్, మహేష్ ఇద్దరికీ ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పారని, ఎమ్మెల్యే పనితీరు నచ్చడంతో పాటు సూపర్‌సిక్స్ అమలు విధానంపై ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నిందితులు చెప్పిన వీడియోను సైతం విడుదల చేశారు. గతంలో వీళ్లు వైఎస్సార్‌సీపీలో ఉన్నమాట నిజమేనని, వీళ్ల ప్రవర్తన నచ్చక పార్టీ నుంచి పంపించేస్తే.. ఆపై టీడీపీ నేతలు ఎల్‌బీఐ లోకేష్, కార్పొరేటర్ నవీన్ చేరదీసి ఆ పార్టీలో చేర్పించారన్నారు. చిత్తూరులో అభివృద్ధిని తాము స్వాగతిస్తామని.. ఇదే సమయంలో అధికార పార్టీ ముసుగులో జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు గాయత్రీదేవి, మొదలియార్ విభాగం నాయకులు జ్ఞానజగదీష్ మాట్లాడుతూ గత నెల పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద అఖిల్ అనే వ్యక్తి ప్రేమ జంటలను పోలీసునంటూ బెదిరించి, బంగారు ఆభరణాలు దోచుకున్నాడని.. అప్పుడు కూడా తమ పార్టీనే దీనిపై ప్రశ్నించిందన్నారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి శిష్యుడైన అఖిల్ టీడీపీకి చెందిన వాడని, అతడికి సైతం వైఎస్సార్‌సీపీ రంగు పులమడానికి అధికార పార్టీ నేతల ప్రయత్నాలు ఫలించలేదన్నారు. చిత్తూరులో మహిళల మాన ప్రాణాలు పోతున్నా, గ్యాంగ్‌రేప్ జరుగుతున్నా ప్రశ్నిస్తామన్న పవణ్‌కళ్యాణ్ నోరు కూడా మెదపడంలేదన్నారు. చిత్తూరులో జరుగుతున్న ఘటనలు పోలీసు శాఖ పనితీరుని ప్రశ్నిస్తున్నట్టు తెలిపారు. పైగా ప్రశ్నించే ప్రతిపక్షంపైనే అధికార పార్టీ నేతలు నిందలు మోపడం పద్ధతికాదన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, పార్టీ నేతలు అంజలిరెడ్డి, మధుబాబు, హరీషారెడ్డి, కవిత, ప్రతిమారెడ్డి, బిందురెడ్డి, విజయకాంతి పాల్గొన్నారు.

నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో బుధవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని రాస్ స్పెషల్ స్కూల్, తపోవనం వృద్ధాశ్రమంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తామన్నారు.

చిత్తూరులో పెద్దమ్మ గొంతు కోసిన యువకుడు

– ఆరు సార్లు కత్తితో పొడిచి పారిపోయిన నిందితుడు



చికిత్స పొందుతున్న గాయత్రి

చిత్తూరు అర్బన్: స్వయానా తనకు పెద్దమ్మ అయ్యే మహిళ గొంతు కోసేశాడో వ్యక్తి. మంగళవారం దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని తేనబండకు చెందిన గాయత్రి (45) మునిసిపల్ కార్పొరేషన్‌లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తోంది. ఈమె చెల్లెలి కుమారుడు నరేంద్ర అనే వ్యక్తికి పెళ్లయ్యి బెంగళూరులో ఉంటున్నాడు. అయితే గాయత్రితో ఇతనికి ఆర్థికపరమైన వివాదం ఏర్పడడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. తన కుటుంబంలో గొడవలకు తన పెద్దమ్మ గాయత్రీనే కారణమని భావించిన నరేంద్ర.. సోమవారం రాత్రి కత్తి తీసుకుని తేనబండలో ఇంటి వద్ద ఉన్న గాయత్రి గొంతు కోసేశాడు. తర్వాత గొంతుపై కత్తితో ఆరు సార్లు దాడిచేశాడు. గాయపడ్డ మహిళను తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి భర్త గోపీనాథ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.